

మూడింటిలోనే ముందంజ

సింగరేణి అక్టోబర్‌లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో వెనుకబడింది. నిర్దేశిత లక్ష్యంలో 91 శాతానికే పరిమితమైంది. 10లో



రెండోసారీ నిధులు పక్కదారి..

ములకలపల్లిలో జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో మరోసారి నిధులు స్వాహా చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం 30°/ 21°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం పొగమంచు ఏర్పడుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: కార్తీక మాసం ప్రారంభమైన సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం అర్చకులు అమ్మవారి సన్నిధిలో రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ శివలింగానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారికి హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ చేశారు. కార్తీక మాసం పూర్తయ్యే వరకు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం ఆకాశ దీపోత్సవం, దీపారాధన పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు.

18 నుంచి జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజులపాటు అన్నపురెడ్డిపల్లి గురుకుల బాలుర పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. అన్నపురెడ్డిపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించే సైన్స్‌ఫేర్‌లో ఏడు ప్రధాన అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, డీఎస్‌ఓ ఎస్.చలపతిరాజు, ఏఎంఓ నాగరాజశేఖర్, ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాధకృష్ణమూర్తి, నాయకులు పర్సా వెంకట్, దుబ్బాకుల రాము పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 18, 19, 20 తేదీల్లో అన్నపురెడ్డిపల్లిలో జరిగే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఈ నెల 5న శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో నిర్వహించే శిక్షణకు అన్ని పాఠశాలల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడు హాజరు కావాలని సూచించారు.

సింగరేణి అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో వివిధ ఏరియాల్లో, వివిధ హోదాల్లో పనిచేస్తున్న 24 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ శనివారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో అడిషనల్ జీఎంలు ఇద్దరు, 9 మంది డీజీఎంలు, 8 మంది అడిషనల్ మేనేజర్లు, ఒక డీవైఎస్‌ఈ, సీనియర్ అండర్ మేనేజర్లు ముగ్గురు ఉన్నారు. వీరందరూ ఈ నెల 11న బదిలీ ప్రాంతాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో ప్రతిభ



ఈత పోటీల్లో పతకాలు సాధించిన సాయి, నాగచైతన్య

సింగరేణి(కొత్తగూడెం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం హైదరాబాద్‌లోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్రస్థాయి ఈత పోటీలు నిర్వహించగా, కొత్తగూడెం విద్యార్థులు ఐదు పతకాలు సాధించారు. నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కొట్టే సాయిశ్రీ వాత్సవ్ మూడు కాంస్య పతకాలు, బండారి నాగచైతన్య రెండు కాం స్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను నవభారత్ పబ్లిక్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీరెడ్డి, స్విమ్మింగ్ కోచ్ హనుమంతరాజు, సామ్యుల్, సంధ్య, సామంత్ అభినందించారు.

‘తీర’ని అన్యాయం

గోదావరి జలాలకు నోచుకోని తీర ప్రాంత రైతులు

- సీతారామతో పాలేరుకు గోదావరి నీటిని తరలించడంపై శ్రద్ధ
- భద్రాచలం, పినపాకలకు నీరివ్వడంలో నిర్లక్ష్యం
- తాలిపేరు ఆయకట్టు రైతుల్లో మొదలైన రగడ



తాలిపేరు నుంచి దుమ్ముగూడెం రైతులకు సాగునీరందించే ఆర్‌సీ చానల్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి జలాలను సీతారామ ప్రాజెక్ట్ ద్వారా పాలేరుకు తరలించి నాగార్జున సాగర్ ఆయకట్టుకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇదే తరుణంలో భద్రాద్రి జిల్లాలోని గోదావరి తీర ప్రాంత మండలాలపై సర్కారు దృష్టి సారించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

దుమ్ముగూడెం నుంచి..

గోదావరి నది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల గుండా ప్రవహిస్తోంది. ఇందులో దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాల మధ్య బ్రిటీష్ జమానాలో సర్ అర్థర్ కాటన్ ఆనకట్ట నిర్మించగా ప్రస్తుతం సీతమ్మ సాగర్ పేరుతో కొత్తగా మరో బ్యారేజీ నిర్మిస్తున్నారు. ఈ రెండు ఆనకట్టలను ఆధారంగా చేసుకుని సీతారామ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి కాలువలు, ఎత్తిపోతల ద్వారా పాలేరు వరకు గోదావరి నీటిని తరలించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక. తద్వారా కొత్తగా నాలుగు లక్షల ఎకరాలు, నాగార్జున సాగర్ పరిధిలో మరో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

డిజైన్ మార్చినప్పుడే..

గోదావరి నీటిని వాడుకునే విషయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉన్నప్పుడు రాజీవ్‌సాగర్, ఇందిరమ్మ సాగర్ ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఈ రెండు ప్రాజెక్టులను కలిపి సీతారామ ఎత్తిపోతలుగా మార్చారు. ఈ క్రమంలో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం పూర్తిగా నిరాదరణకు గురైంది. ఆ తర్వాత మార్చిన డిజైన్ల వల్ల ఇల్లెందు నియోజకవర్గం అడ్రస్ లేకుండా పోయింది. అరకొరగా ఆయకట్టు కలిగిన పినపాక నియోజకవర్గం కోసం మారెళ్లపాడు ఎత్తిపోతలను ప్రారంభించినా ఆశించిన పురోగతి లేదు. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సీతారామపై ఫోకస్ పెరిగింది. యుద్ధప్రతిపాదికన మూడు పంప్‌హౌస్‌లు ప్రారంభించారు. గోదావరి నీటిని వైరా రిజర్వాయర్‌కు తరలించేందుకు రాజీవ్ కెనాల్ పనులు చేపట్టారు. ఇప్పుడు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, పాలేరు టన్నెల్ పనులపై శ్రద్ధ చూపిస్తున్నారు. అయితే గోదావరి ప్రవహించే తీర ప్రాంత మండలాలకు న్యాయం చేయడంపై దృష్టి సారించడం లేదు.

రైతుల్లో ఆందోళన

తలాపునే గోదావరి.. మన చేను చెలక ఎడారి అన్నట్టుగా తీర ప్రాంత రైతుల పరిస్థితి తయారైంది. చర్ల మండలంలో తాలిపేరు ప్రాజెక్టు ద్వారా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో అధికారికంగా 24 వేల ఎకరాలకు నీరు అందుతుంది. ఖరీఫ్‌లో మొత్తం ఆయకట్టుకు నీరు ఇస్తుండగా రబీకి వచ్చే సరికి మూడు జోన్లుగా విభజించి రొటేషన్ పద్ధతిలో ప్రతీ ఏడు ఒక జోన్‌ను నీరు ఇస్తూ వస్తున్నారు. గతేడాది రెండో జోన్‌కు ఇవ్వాల్సి ఉండగా కాలువల మరమ్మతుల కారణంగా సాధ్యం కాలేదు. అయితే ఇప్పటికే రెండు రబీ సీజన్లు నష్టపోయిన మూడో జోన్ రైతులు ఈసారి నీరు మాకే ఇవ్వాలని పట్టుబట్టగా గతేడాది నీరు రాని తాము ఈసారి కూడా ఇవ్వకపోతే మూడు సీజన్లు నష్టపోతామని రెండో జోన్ రైతులు తమ బాధలు చెప్పుకున్నారు. ఈ అంశం చినికి చినికి గాలివానగా మారడంతో చివరకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు జోక్యం చేసుకుని ఈ సీజన్‌లో రెండో జోన్‌కు నీరు ఇచ్చేలా రైతులను ఒప్పించాల్సి వచ్చింది.

గోదావరి జలాలు తాలిపేరులో ఎత్తిపోస్తే..

దిగువన ఏపీలోని గోదావరి జిల్లాలో ఏడాదికి మూడు పంటలు పడే పరిస్థితి ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కనీసం రెండు పంటలకు నీరు అందించే పరిస్థితి లేకపోవడం దారుణమని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలు విన్న ప్రతీసారి ప్రగళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తామని హామీలు గుప్పించడం తప్పితే ఇంత వరకు ఆ దిశగా ఎటువంటి కార్యాచరణ లేదని ఇక్కడి రైతులు చెబుతున్నారు. కనీసం గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తాలిపేరు ప్రాజెక్టులోకి మళ్లించి అక్కడి నుంచి ఇప్పటికే ఉన్న డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ ద్వారా చర్ల, దుమ్ముగూడెం మండలాలకు సమృద్ధిగా సాగునీరు ఇచ్చే విధంగా మరో ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేయాలని కోరుతున్నారు. ఇదే విధంగా మారెళ్లపాడు పనుల్లో వేగం పెంచాలని పినపాక నియోజకవర్గ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కార్తీక పూజలు షురూ

రామాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం



చిత్రకూట మండపంలో వ్రత క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు



శివాలయంలో అభిషేకం జరుపుతున్న అర్చకుడు

భద్రాచలం: భక్తులు ఎంతో పవిత్రంగా భావించే కార్తీక మాసం ప్రారంభమైంది. భద్రాచలంలో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చిత్రకూట మండపంలో సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను జరిపారు. దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ ఉమామహేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఉపాలయంలో సైతం కార్తీక మాస పూజలు జరిగాయి. శివుడికి పంచామృతం అభిషేకం నిర్వహించారు. సాయంత్రం కార్తీక మాస పురాణ విశిష్టత, సంగీత, నృత్య కార్యక్రమాలను జరిపారు.

వైభవంగా సువర్ణ తులసీ అర్చన

దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గిరిజన రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం

ఐటీడీఏ పీఓ రాహుల్



ట్రాన్స్‌కో, అటవీ అధికారులతో చర్చిస్తున్న పీఓ

ఇల్లెందురూరల్: ఏజెన్సీలో గిరిజన రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరా కోసం గతంలో రైతులు ఆర్జీ పెట్టుకోగా, శనివారం ఆయన ట్రాన్స్‌కో, అటవీశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మొదటి దఫాగా పోడు రైతులందరికీ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అటవీశాఖకు ఇబ్బందిలేకుండా విద్యుత్ స్తంభాలు వేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తే రైతులు రెండో పంటను సాగు చేసే అవకాశం కలుగుతుందన్నారు. అంతకుముందు రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న పంటను పరిశీలించి మొక్కజొన్న సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోర్లను వినియోగించుకొని ఇతర పంటలను కూడా సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మీనారాయణ, మునీర్‌పాష, కోటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

కొత్తగూడెంఅర్బన్: గిరిజన విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. పట్టణంలోని రామవరం నెహ్రూనగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. వసతి గృహంలో సౌకర్యాలు, సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కళాశాల ప్రిన్సిపాల్ అనురాధను ఆదేశించారు. రాబోయే న్యాక్ (ఎన్ఏఏసి) అక్రిడేషన్, విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలపై పలు సూచనలు చేశారు. కష్టపడి చదువుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ధాన్యం కొనుగోళ్లపై శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వరి ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. మద్దతు ధర పొందేందుకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని వివరించారు. ఈ సమావేశంలో సీపీఓ సంజీవరావు, డీఎం సివిల్ త్రినాథ్‌బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, డీసీఓ ఖుర్షిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6వ తేదీతో గడువు ముగియనుందని పేర్కొన్నారు. 2018 నవంబర్ ఒకటో తేదీ నుంచి 2024 అక్టోబర్ 3వ తేదీ వరకు మూడు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఫామ్ 19 ద్వారా దరఖాస్తు నింపి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. http://ceotserms2.telangana.gov.in/mlc/form19.aspx వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ అప్పుల వల్లే లోటు బడ్జెట్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే రాష్ట్రానికి లోటు బడ్జెట్ ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం సీఆర్ భవన్‌లో నిర్వహించిన కొత్తగూడెం జిల్లాస్థాయి కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌ను చక్కదిద్దేందుకు రాష్ట్ర మంత్రివర్గం సమష్టిగా శ్రమించాలన్నారు. కేంద్రం తీసుకున్న జమిలి ఎన్నికల విధానాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుందని, ఈ ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. మతం పేరుతో ఓట్లు దండుకునే ప్రయత్నంలో భాగంగానే జమిలి ఎన్నికల జపాన్ని వల్లిస్తోందని విమర్శించారు. పంటల ధరలపై కేంద్రం ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా రైతులను నష్టాల ఊబిలోకి నెడుతోందని అన్నారు. రుణమాఫీ జాప్యం వల్ల రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఖరీఫ్, రబీతో కలిపి రెండు దఫాలుగా రైతు భరోసా చెల్లించాల్సి ఉండగా నేటికీ దీనిపై స్పష్టత ఇవ్వలేకపోతుందన్నారు. బీసీ కులగణనను స్వాగతిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల లెక్కలు కూడా తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, ఎండి.మౌలానా, జిల్లా కార్యదర్శి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పుల్లారెడ్డి, సారయ్య, వెంకటేశ్వర్ రావు, సలీం, శ్రీనివాసరావు, నరాటి ప్రసాద్, రవికుమార్, ఎల్లయ్య, నరేంద్ర కుమార్, శంకర్, పూర్ణచందర్ రావు, సాయిబాబు, మురళీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోంగార్డుల సమస్యలపై ఎస్పీకి వినతి



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న హోంగార్డులు

కొత్తగూడెంటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హోంగార్డ్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం ఎస్పీ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఏఆర్) సత్యనారాయణ, ఆర్ఎస్ఐ నర్సింహారావు, ఏఆర్ఎస్ఐ సత్తార్, అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మంలోని చెరుకూరి మామిడితోటలో ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యాన జరిగే ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొంటారు. అలాగే, గురుదక్షిణ ఫౌండేషన్‌లో జెడ్పీ మాజీ చైర్మన్ చేకూరి కాశయ్య విగ్రహ ఆవిష్కరణకు హాజరయ్యాక, ఇల్లెందు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొననున్నారు.

పుట్టపాడు ఎన్‌కౌంటర్‌పై మెజిస్టీరియల్ విచారణ

చర్ల: చర్ల మండల సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పుట్టపాడులో గతేడాది మే నెలలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై మెజిస్టీరియల్ విచారణ నిర్వహించారు. భద్రాచలం ఆర్డీఓ కె.దామోదర్ రావు శనివారం ఉదయం ప్రత్యేక పోలీసు బందోబస్తు నడుమ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పుట్టపాడు గ్రామాన్ని సందర్శించారు. అక్కడ జరిగిన ఎన్‌కౌంటర్‌పై విచారణ నిర్వహించి గ్రామానికి చెందిన ఆదివాసీల నుంచి వివరాలను సేకరించారు. గతేడాది పుట్టపాడు సమీపంలోని గుట్టపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ మిలీషియా కమాండర్ రాజేష్‌తో పాటు దళ సభ్యుడు నందాల్ మృతి చెందిన విషయం విదితమే.

మెస్ చార్జీల పెంపు హర్షణీయం

పాల్వంచరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకుల హాస్టళ్లలో విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్స్ చార్జీల పెంపు హర్షణీయమని గిరిజన గురుకుల తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్యామ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో 2017 నుంచి మెస్ చార్జీలు పెరగకపోవడంతో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా గురుకుల విద్యార్థులకు మెనూ అమలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.

5న జిల్లాలో బీసీ కమిషన్ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ సహా సభ్యులు ఈనెల 5న ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు కుల గణనపై కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన మైనార్టీ సంఘాల నాయకులు, మత గురువులు, మేధావులు, విద్యావేత్తలతో వారు సమావేశమవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో సలహాలు, సూచనలను ధ్రువీకరించిన అఫిడవిట్‌తో అందజేయాలని సూచించారు.

ఆటో చోరీపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: ప్యాసింజర్ ఆటో చోరీ సంఘటనపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని పరిధి గాజులరాజంబస్తీకి చెందిన వరాల సమ్మయ్యకు ఐదు ప్యాసింజర్ ఆటోలున్నాయి. అందులో ఒకటి తాను నడుపుకుంటూ, మిగతా ఆటోలను డ్రైవర్లకు అద్దెకు ఇస్తున్నాడు. పాల్వంచకు చెందిన డ్రైవర్ కొత్త సతీష్‌కు ఒక ఆటో ఇస్తున్నాడు. అయితే సతీష్ తన ఆటోను చోరీ చేశాడనే అనుమానాలున్నాయని, ఆటో విలువ రూ.70 వేల వరకు ఉంటుందని త్రీటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.50వేల విలువైన మద్యం పట్టివేత

కారేపల్లి: ఖమ్మం నుంచి కారేపల్లి మండలంలోని సీతారామపురానికి కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.50 వేల విలువైన మద్యాన్ని శనివారం రాత్రి ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడు ఖమ్మంలోని వైన్స్ నుంచి ఈ మద్యం తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పక్కా సమాచారంతో తనిఖీ చేపట్టి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ స్రవంతి, ఎస్సై వసంతలక్ష్మి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

ఊరూరా పెళ్లి సందడి!

జిల్లా అంతటా భాజాభజంత్రీల మోత మోగనుంది. కార్తీక మాసం మొదలుకావడంతో ఆదివారం నుంచి డిసెంబర్ చివరి వారం వరకు వరుసగా మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిసందడి నెలకొననుంది. ఇప్పటికే చిన్నాపెద్ద కల్యాణ మండపాల బుకింగ్ పూర్తికాగా.. ఫొటోగ్రాఫర్లు, క్యాటరింగ్, డెకరేషన్, ట్రావెల్స్, మంగళ వాయిద్యాల వారికి సైతం గిరాకీ పెరిగింది. మరోపక్క ఒక్కో రోజు రెండు నుంచి మూడు ముహూర్తాలు ఉండడంతో అర్చకులకు ఖాళీ లేని పరిస్థితి నెలకొంది. మొత్తంగా ఈ సీజన్‌లో వేలాది జంటలు పెళ్లితో ఒకటి కానున్నాయి. – చుంచుపల్లి



ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన పెళ్లి వేదిక

నేటి నుంచి రెండు నెలల పాటు శుభముహూర్తాలు

- ఫంక్షన్ హాళ్ల బుకింగ్ పూర్తి.. ఊపందుకుంటున్న వ్యాపారాలు
- జిల్లాలో ఒక్కటి కానున్న వేలాది జంటలు

శుభ ముహూర్తాలు ఇవే..

పెళ్లిళ్లకు కార్తీకమాసంలో శుభ ముహూర్తాలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఈ నెల 3నుంచి డిసెంబర్ 26 వరకు వివాహాలకు శుభముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఈనెల 3, 7, 8, 9, 10, 13, 14,15, 16, 17వ తేదీల్లో శుభఘడియలు ఉన్నాయి. ఇక డిసెంబర్‌లో 5, 6, 7, 8, 9, 10, 13, 14, 15, 18, 26 తేదీల్లో ముహూర్తాలు ఉండగా ఒక్కో రోజు రెండు నుంచి మూడు ముహూర్తాలు ఉండడంతో వధూవరుల తల్లిదండ్రులు పెళ్లిళ్లు నిర్ణయించారు. వరుస ముహూర్తాల దృష్ట్యా చిన్నాపెద్ద కల్యాణమండపాలన్నీ ముందుగానే బుక్ అయిపోయాయి. చిన్న మండపాల అద్దె రూ.వేలల్లో ఉంటే, ఏసీతో కూడిన పెద్ద ఫంక్షన్ హాళ్ల అద్దె రూ.లక్షకు పైగానే పలుకుతోంది. ఇక వస్త్రాల కొనుగోలు, వాహనాల ఏర్పాటుతో పాటు ఫొటోగ్రాఫర్లు, అర్చకులను మాట్లాడుకోవడంలో వధూవరుల బంధువులు బిజీగా గడుపుతున్నారు. అలాగే, క్యాటరింగ్ నిర్వాహకులు, మండపాల డెరేషన్ నిర్వాహకులకు కూడా డిమాండ్ పెరిగింది.



కొత్తగూడెం క్లబ్‌లో స్వాగత తోరణాలు

ముందుగానే బుకింగ్



కార్తీకమాసం మంచి ముహూర్తాలు ఉండడంతో ఎక్కువ మంది పెళ్లిళ్లకు నిర్ణయించుకున్నారు. ఈ సీజన్‌లో ఆశాజనకంగా వ్యాపారం సాగే అవకాశం కనిపిస్తోంది. ఈ రెండు నెలల్లో జరగనున్న కల్యాణాలకు ముందుగానే మండపాల డెకరేషన్ కోసం బుకింగ్ చేసుకుంటున్నారు.

– నర్సింహారావు, డెకరేటర్

మంచి ముహూర్తాలు



నవంబర్, డిసెంబర్‌లో 21 రోజుల పాటు మంచి ముహూర్తాలు వచ్చాయి. ఆ తర్వాత కాస్త విరామం ఉండడంతో కార్తీకమాసంలో ఎక్కువ మంది ముహూర్తాలను ఎంచుకున్నారు. ఇటీవల చాలామందికి ముహూర్తాలు పెట్టాం. ఈ సీజన్‌లో మాకు చేతి నిండా పని లభిస్తుంది.

– డి.నాగశర్మ, పురోహితులు

నేడు సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం సహకారనగర్: సకల ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, వన సమారాధన ఖమ్మంలోని చెరుకూరి మామిడితోటలో ఆదివారం జరగనుంది. ఈమేరకు తెలంగాణ ఎంప్లాయిస్(టీజీఈ) జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవోస్, టీజీవోస్, ఉపాధ్యాయ తదితర సంఘాల నాయకుల ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పోలీస్ అధికారులు, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు శనివారం చెరుకూరి మామిడితోటలో ఏర్పాట్లను పరిశీలించారు. కాగా, సమ్మేళనానికి ఉద్యోగులు కుటుంబసమేతంగా హాజరుకావాని నాయకులు కోరారు. ఈకార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్, గంగవరపు బాలకృష్ణ, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను వివరిస్తున్న టీజీఈజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

ఇసుక సీజ్

ములకలపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక రాశులను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. మండల పరిధిలోని గుర్రాలకుంట గ్రామశివారులో ఇసుక అక్రమంగా నిల్వ చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో గిర్దావర్ భద్రు తనిఖీలు నిర్వహించారు. సుమారు 15 ట్రాక్టర్ల అక్రమ ఇసుకను సీజ్ చేసి, రెండు లారీల్లో తహసీల్ కార్యాలయ ఆవరణకు తరలించారు.

దమ్మపేటలో..

దమ్మపేట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని రెడ్యాలపాడు గ్రామ శివారులో ఉన్న వాగు నుంచి సత్తుపల్లి వైపు ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్‌ను గండుగులపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకుని దమ్మపేట స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని అదనపు ఎస్సై బాలస్వామి తెలిపారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు జగదాంబా గుంపు శనివారం పట్టుకుని సీజ్‌చేశారు. టేకులపల్లి మండలం చంద్రూ తండాకు చెందిన బానోతు నెహ్రూ అనే వ్యక్తి తన ట్రాక్టర్ ద్వారా బొమ్మనపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగుల్ మీరాఖాన్ తెలిపారు.

గల్లంతవుతున్న భక్తులను రక్షించిన గజ ఈతగాడు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద గోదావరి నదిలో శనివారం కార్తీక మాసం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు గల్లంతవుతుండగా గజ ఈతగాడు కాపాడాడు. హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు మాధవి నీటి లోతు అంచనా తెలియక గోదావరి నీటిలో గల్లంతవుతుండగా, అక్కడే ఉన్న గజ ఈతగాడు ప్రసాద్ గమనించి రక్షించాడు. మరో 15 నిమిషాల తర్వాత హైదరాబాద్‌కే చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయి కూడా ఇదే విధంగా స్నానం చేస్తూ గల్లంతవుతుండగా కాపాడాడు.



గల్లంతవుతున్న మహిళను రక్షించి ఒడ్డుకు తీసుకొస్తున్న గజ ఈతగాడు ప్రసాద్

నామమాత్రంగానే ఐరన్ మెస్ ఏర్పాటు

భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేటప్పుడు నీటిలో గల్లంతుకాకుండా శుక్రవారం రాత్రి అధికారులు గోదావరిలో ఐరన్ మెస్ ఏర్పాటు చేశారు. అయితే ఇది పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో శనివారం ఇద్దరు భక్తులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భక్తులకు ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని, గోదావరి ఘాట్ వద్ద పోలీస్ సిబ్బందిని కూడా నియమించాలని పలువురు కోరుతున్నారు.

పోడు వివాదంలో దంపతులకు గాయాలు

కారం చల్లి.. మారణాయుధాలతో దాడి

చంద్రుగొండ : రెండు గిరిజన కుటుంబాల మధ్య నలుగుతున్న పోడు భూవివాదం రక్తసిక్తమైంది. చంద్రుగొండ మండలం రావికంపాడు పంచాయతీ శివారు దుబ్బతండాలో భార్యాభర్తలపై మరోవర్గం పథకం ప్రకారం శనివారం కళ్లల్లో కారం చల్లి, మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో దుబ్బతండాకు చెందిన బాణోత్ బాలు, లక్ష్మిలకు తీవ్రగాయాలయ్యాయి. రక్తపు మడుగులో విలవిల్లాడుతున్న క్షతగాత్రులను తొలుత ఆటోలో చంద్రుగొండలోని పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కొన్నేళ్లుగా దుబ్బతండాకు చెందిన రెండు కుటుంబాల మధ్య పోడు భూమి విషయమై వివాదం సాగుతోంది. పలుమార్లు పెద్దలు కూడా పంచాయితీ చేశారు. తాజాగా కూలీలతో కలిసి వెళ్లి తన వాటాకు వచ్చిన భూమిలో భార్యాభర్తలు పత్తి తీస్తుండగా ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేశారు. బాధితుల కుమారుడు హనుమంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



క్షతగాత్రులను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

ఆస్తి పంచలేదని..

తండ్రిని హతమార్చిన కుమారుడు

మణుగూరు టౌన్: ఆస్తి పంచలేదని కుమారుడు దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన సంఘటన మండలంలోని పగిడేరు గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుంజా భీమయ్య(59)–జోగమ్మకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. వీరిలో ఇద్దరు కూతుళ్లకు, చిన్న కుమారుడు రాముకు వివాహాలు చేశారు. మరో కూతురు తోపాటు, భీముకి వివాహం జరగకపోవడంతో వారితో కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. 10 ఎకరాల పోడు భూమి, 50 పశువులలో తన వాటా పంచి ఇవ్వాలని చిన్న కుమారుడు రాము తరచూ తండ్రితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కూడా మద్యం మత్తులో తండ్రిపై దాడి చేశాడు. కర్రతో తలపై విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో భీమయ్యకు తీవ్ర గాయాలు కాగా, కుటుంబ సభ్యులు 100 పడకల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మణుగూరు సీఐ సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా డీఎస్పీ రవీందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించి మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ

అదనపు కట్నం కోసం వేధింపులు..

ఇల్లెందు: పోలీసులు శనివారం వేధింపుల కేసు నమోదు చేశారు. భర్త మధు, అత్త వెంకటమ్మ కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మండలంలోని సంజయ్‌నగర్‌కు చెందిన కొలిపాక శైలజ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. సూర్య తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని పెదతండాలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందగా బంధువుల ఫిర్యాదుతో శనివారం కేసు నమోదుచేసినట్లు సీఐ ముష్కస్ రాజు తెలిపారు. పాల్వంచ మండలం సోములగూడేనికి చెందిన కామిశెట్టి జగదీష్(30) పెదతండాలోని సాయిరామ్ ఇంజనీరింగ్ వర్క్స్‌లో కొన్నేళ్లుగా పని చేస్తున్నాడు. ఈనెల 1న ఆయన పనిలో ఉండగా గుండెపోటు వచ్చిందని ఆస్పత్రిలో చేర్పించినట్లు జగదీష్ బావమరిదికి షెడ్డు యజమాని ఫోన్ చేసి చెప్పారు. అనంతరం జగదీష్ మృతి చెందాడని ఆయన తల్లి ఈశ్వరమ్మకు తెలిపారు. దీంతో బంధువులు చేరుకోగా జగదీష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని, షెడ్డు యజమాని బ్రహ్మచారిని విచారించాలని శనివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగం పేరిట మోసగించిన వ్యక్తిపై...

ఇల్లెందురూరల్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పోలారం గ్రామానికి చెందిన నాగమణి ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసింది. ఏఎన్ఎంగా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో కొత్తగూడేనికి చెందిన మాతంగి రాజేష్‌కు రూ.1.75 లక్షలు ఇచ్చింది. ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో ఉద్యోగం వచ్చిందని చెప్పడంతో ఆమె కొంతకాలం అక్కడ పనిచేసింది. నెలగడిచినా వేతనం రాకపోవడంతో అనుమానంతో ఆరా తీసింది. తనకు ఉద్యోగం ఇవ్వలేదని ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేయడంతో మోసపోయానని గుర్తించి శనివారం కొమరారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై సోమేశ్వర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సుజాతనగర్: పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై సుజాతనగర్ ఠాణాలో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సుజాతనగర్‌కు చెందిన ఎస్కే ఈసుబ్‌మియా(49) కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీ గేట్ వద్ద శనివారం రాత్రి లారీ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. సీతారాంపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చాప ఉమ భర్త, ఆదివాసీ జేఏసీ నాయకుడు చాప ముత్తయ్య బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గౌతమీనగర్ కాలనీ వద్ద లారీ ఢీకొని గాయాలయ్యాయి. అశ్వాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసు వాహనంలో ముత్తయ్యను అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు.

కులగణన సర్వే విజయవంతం చేయాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య

కొత్తగూడెంరూరల్: జిల్లాలో సమగ్ర కులగణన సర్వే విజయవంతం చేయాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని కోల్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ సర్వేకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సూచించారు. అనంతరం ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావులు మాట్లాడుతూ జిల్లా సమగ్ర కులగణన సర్వే విజయవంతం చేయాలని కోరారు. కాగా పదేళ్లు పార్టీ జెండాలను మోసిన కార్యకర్తలను అధిష్టానం పట్టించుకోవడంలేదని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని చుంచుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంతోటిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ మెంబర్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కంచర్ల చంద్రశేఖర్, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, నాయకులు ఏనుగుల అర్జున్‌రావు, రాయల శాంతయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య

సీతారామ లింక్ కెనాల్ పనుల అడ్డగింత

జూలూరుపాడు: సీతారామ లింక్ కెనాల్ కింద భూములు కోల్పోయిన మండలంలోని వినోభానగర్ రైతులు శనివారం పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా భూ నిర్వాసిత రైతులు మాట్లాడుతూ ఐదు నెలలుగా ఏన్కూరు లింక్ కెనాల్ పనులు జరుగుతున్నా నష్టపరిహారం విషయంలో కాలయాపన చేస్తున్నారన్నారు. జూలూరుపాడులో జరిగిన గ్రామ సభలో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య ఎకరానికి రూ.13.50 లక్షలు నష్టపరిహారం ఇస్తామంటే అంగీకరించపోవడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎకరాకు రూ 20 లక్షలు ఇస్తామని చెప్పారని తెలిపారు. అలాగే, పట్టా ఉన్న వారికి, లేని వారికి, ఎస్టీలు, ఓబీసీలకు తలా ఓ రకంగా పరిహారం కాకుండా అందరికీ ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. అప్పటివరకు పనులు జరిగనిచ్చేది లేదని చెప్పంతో పనులు నిలిచిపోయాయి. రైతులు గుగులోత్ శ్రీనివాసరావు, గుగులోత్ రమేష్, సీహెచ్.ప్రసాద్, యల్లంకి వెంకటేశ్వర్లు, ముదిగొండ రమేష్, సిరికొండ నరసింహారావు, బండారి మల్లయ్య, సిరికొండ నాగయ్య, పుష్పరాజ్యం, కుంచాల కోటేశ్వరరావు, వాణి, శివ, పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న భూనిర్వాసిత రైతులు

క్రీడలతో సర్వతోముఖాభివృద్ధి

- కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి
- ఖమ్మంలో కేయూ స్థాయి అథ్లెటిక్ పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో తర్ఫీదు పొందడం ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న కేయూ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు ఖమ్మం, వరంగల్, ఆదిలా బాద్ ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం సాధించి పోటీల్లో పోటీల్లో సత్తా చాటడం ద్వారా వ్యక్తిగతంగానే కాక దేశం ప్రతిష్ఠ పెరుగుతుందని తెలిపారు. అంతేకాక యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. కాగా, కేయూ పరిధిలో క్రీడాపోటీలు విజయవంతం నిర్వహించేలా కమిటీలను నియమించి, క్రీడాకారుల ఎంపిక విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి వెంకయ్య మాట్లాడగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, యూసీపీఈ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రవికుమార్, కేయూ పీడీల సంఘం కార్యదర్శి డాక్టర్ బి.వెంకన్నతో పాటుపి.శ్రీనివాస్, కోటి, ఎండీ.గౌస్, షఫీ, శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్, ఏటీబిటీ.ప్రసాద్, జె.ఉపేందర్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

గంజాయి స్వాధీనం

సుజాతనగర్: సుజాతనగర్ పోలీసులు శనివారం 84 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఎస్.శ్రీకాంత్ అనే వ్యక్తి మరో వ్యక్తి సాయంతో గంజాయిని తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో మండలంలోని నాయకులగూడెం గ్రామం వద్ద పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

వేంసూరు: అప్పుల భారంతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని చౌడవరం గ్రామానికి చెందిన నల్లిబోయిన గురునాథం(38) వ్యవసాయ పెట్టుబడికి, ఇల్లు కట్టుకునేందుకు అప్పులు చేయగా ఆర్థిక సమస్యలు ఎదురయ్యా యి. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇందిరమ్మ ఇంటికి ఇక్కట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

వాటా ఉండాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో చేపట్టే పథకాలకు ఇది వర్తించకున్నా.. కేంద్ర ప్రభుత్వ చేయూతతో అమలు చేసే పథకాల్లో మాత్రం ఈ నిబంధనను అమలు చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ నగరంలో పేదలు వ్యక్తిగత ఇళ్లను నిర్మించుకునేందుకు సొంత జాగా ఉండటం కష్టమే. అందుకే అపార్ట్‌మెంట్ల తరహాలో ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇస్తోంది. గతంలో వాంబే పథకం, ఆ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్లు అదే తరహాలో నిర్మితమయ్యాయి. కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ పథకం కింద కూడా ఇళ్ల సముదాయాలనే నిర్మించి ఇవ్వనుంది. ఈ తరహా ఇళ్లకు లబ్ధిదారుల వాటా చూపాలని కేంద్రం అడుగుతోంది.

పైసా అవసరం లేదన్న రాష్ట్ర సర్కారు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. కానీ కేంద్ర నిబంధన ప్రకారం.. యూనిట్ కాస్ట్ కింద రాష్ట్ర ప్రభుత్వం భరించే రూ.5 లక్షలకుతోడు లబ్ధిదారుల వాటాను కూడా చూపించాల్సి వస్తుంది. ఆ మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించడంగానీ, లేదా రాష్ట్ర ప్రభుత్వమే భరించడంగానీ తప్పదని అధికారవర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.ఏడు లక్షల నుంచి రూ.8 లక్షల చొప్పున ఖర్చయ్యాయి. యూనిట్ కాస్ట్‌కు అదనంగా అయ్యే మొత్తాన్ని లబ్ధిదారు వాటాగా చూపే చాన్స్ ఉండనుంది.

పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల ప్రణాళిక ఏంటి?

తొలుత ఇందిరమ్మ ఇళ్లను సొంత జాగా ఉన్నవారికే మంజూరు చేయనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే హైదరాబాద్, ఇతర ప్రధాన పట్టణాల్లో సొంత జాగా ఉన్న పేదల సంఖ్య నామమాత్రమే. అలాంటప్పుడు పేదలకు ఇళ్లు ఎలాగనే ప్ర శ్నలు వస్తున్నాయి. ఈ దిశగా ప్రభుత్వ ప్రణాళిక ఏమిటనే చర్చ జరుగుతోంది.

హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్- 2031ను పునఃపరిశీలించాలి

సీఎంకు బీజేపీ నేత గూడూరు సూచన

సాక్షి, హైదరాబాద్: 2013లో నోటిఫై చేసిన హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్–2031ను పునఃపరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీనేత గూడూరు నారాయణరెడ్డి సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మారిన పరిస్థితులకు మాస్టర్‌ప్లాన్–31 ఏమాత్రం ఉపయోగపడదని శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లను యాచకులుగా మార్చేస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికే హైడ్రా రియల్ ఎస్టేట్ డెవలపర్ల వెన్నువిరిచేసిందన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హైదరాబాద్ అభివృద్ధికి అనుగుణంగా ఈ మోడల్‌ను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల అనేక మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నందున మళ్లీ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.



75 ప్రశ్నలతో కుటుంబ సర్వే

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సన్నద్ధం ● పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ విడుదల
రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం పూర్తి ● జిల్లాల్లో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఈ సర్వేపై రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వం.. సర్వే ఉద్దేశం, లక్ష్యం తదితర అంశాలను వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కొనసాగే ఈ సర్వేకు సంబంధించిన పూర్తిస్థాయి సూచనలను అందులో పొందుపర్చింది. సర్వే రెండు భాగాలుగా సాగుతుంది. మొదటి విభాగం (పార్ట్–1)లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. రెండో విభాగం(పార్ట్–2)లో కుటుంబ వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలుంటాయి. ఇందులో 56 ప్రధాన ప్రశ్నలు కాగా.. మిగతా 19 ఉప ప్రశ్నలు.

ఎంపిక బాధ్యతలు జిల్లా కలెక్టర్లకు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో జిల్లా కలెక్టర్ల పాత్ర కీలకం. జిల్లాస్థాయి, మండల స్థాయి నోడల్ అధికారుల నియామకం మొదలు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల గుర్తింపు ప్రక్రియ అంతా కలెక్టర్ల ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. అదేవిధంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు బ్లాకుల కేటాయింపు బాధ్యత కూడా కలెక్టర్లదే. కిందిస్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు సర్వే నిర్వహించాల్సిన తీరు, సమాచార గోప్యత తదితరాలకు సంబంధించిన శిక్షణ కలెక్టర్లే ఇస్తారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా ప్రభుత్వ ఉద్యోగులనే ఎంపిక చేయాలి. అవసరం ఉన్న చోట మాత్రం సీఆర్‌పీ (కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్), గెస్ట్ టీచర్ల సేవలు వినియోగించుకోవచ్చు. సెన్సెస్ డైరెక్టర్ నుంచి ఎన్యుమరేషన్ బ్యాక్ (ఈబీ) మ్యాపులు తీసుకుని ఆ మేరకు బ్లాకుల విభజన చేయాలి. ఒక ఎన్యుమరేషన్ బ్లాక్‌లో 175 వరకు కుటుంబాలుంటాయి. అంతకంటే ఎక్కువ కుటుంబాలు ఉంటే బ్లాకుల విభజన చేయాలి. ఎన్యుమరేటర్లు సర్వే పూర్తి చేసిన తర్వాత ఆ సమాచారంలోని 10 శాతం కుటుంబాలను ర్యాండమ్ పద్ధతిలో ఎంపిక చేసి వాటిని సూపర్‌వైజర్లు మరోమారు తనిఖీ చేయాలి. ఎన్యుమరేటర్ పనితీరును ఈ రకంగా అంచనా వేయాలి. జిల్లా నోడల్ అధికారిగా అధనపు కలెక్టర్‌ను నియమించాలి. సర్వే నిర్వహణలో భాగంగా రోజువారీ పురోగతిని ప్రణాళిక శాఖకు ప్రతిరోజు సాయంత్రం 6గంటల లోపు పంపాలి.

పక్షం రోజుల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

5న లేదా 6న ప్రక్రియ ప్రారంభిస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- రాజకీయ జోక్యం లేకుండా యాప్ ద్వారా ఎంపిక
- ఇంటి పునాదుల నుంచి పూర్తయ్యేదాకా దశలవారీగా సొమ్ము విడుదల
- అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెడతామని వెల్లడి
- ఈ టర్మ్ అంతా రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని వ్యాఖ్య


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో ప్రారంభించి పక్షం రోజుల్లో పూర్తి చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక యాప్ ద్వారా జరుగుతుందని, ఎంపికలో రాజకీయ జోక్యం ఏమాత్రం ఉండదని చెప్పారు. నిరుపేదలకు సొంతింటి వసతి కల్పించడం లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే మంజూరు చేస్తాం. 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తగ్గకుండా ఇళ్లను నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ ఇళ్లకు ప్రత్యేక డిజైన్ అంటూ ఉండదు. లబ్ధిదారులకు ఉన్న జాగా ఆధారంగా వారే కావాల్సిన ఆకృతిలో నిర్మించుకోవచ్చు. అయితే వంటగది, మరుగుదొడ్డి కచ్చితంగా ఉండేలా చూడాలి.

దశలవారీగా సొమ్ము విడుదల: ఇందిరమ్మ ఇళ్లకు పునాదులు నిర్మించుకున్నాక రూ.లక్ష, గోడల నిర్మాణం తర్వాత రూ.లక్షన్నర, పైకప్పునకు రూ.లక్షన్నర చొప్పున చెల్లిస్తాం. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మిగతా మొత్తం అందజేస్తాం. ఈ సొమ్మును బ్యాంకు ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా జమ చేస్తాం. తొలిదశలో కేవలం సొంత జాగా ఉన్నవారికే ఇళ్లను మంజూరు చేస్తాం. తదుపరి విడతలో భూమిలేని నిరుపేదలకు స్థలం ఇచ్చి నిధులు అందజేస్తాం. నియోజకవర్గానికి 3,500కు తగ్గకుండా ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేస్తున్నాం. నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లను నిర్మించేలా చూస్తాం. ఈ ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణ కోసం 16 శాఖల నుంచి సిబ్బందిని సమీకరిస్తున్నాం.

నిధులను సమీకరించుకుంటాం..: తొలిదశ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.20వేల కోట్ల వరకు ఖర్చవుతాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.7,740 కోట్లను కేటాయించింది. కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేందుకు ప్రయత్నిస్తున్నాం. గత ప్రభుత్వం చేపట్టి వదిలేసిన ఇళ్లను కూడా పూర్తి చేస్తాం. అవసరమైన నిధులను వివిధ మార్గాల్లో సమీకరించుకుంటాం. కొత్తగా ఏర్పడే ఇందిరమ్మ కాలనీల్లో ప్రభుత్వమే మౌలిక వసతులు కల్పిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెడతాం..

గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు తేవటంలో విఫలమైంది. మేం ఆ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర నిబంధనలు అనుసరించటంతోపాటు అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెట్టాలంటే కూడా పెడతాం. మాకు భేషజాలు లేవు. సర్పంచుల పదవీకాలం పూర్తయినందున ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీల్లో వారి ప్రాతినిధ్యం లేదు. తదుపరి దశ నాటికి వారు ఉండేలా అవసరమైతే జనవరి నాటికే సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తాం..''అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ టర్మ్ అంతా రేవంతే సీఎం

సీఎం రేవంత్‌రెడ్డిని మారుస్తారంటూ కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టర్మ్ పూర్తయ్యేందుకు ఇంకా నాలుగేళ్ల ఒక నెల సమయం ఉందని, అప్పటి వరకు రేవంతే సీఎంగా ఉంటారని చెప్పారు. తదుపరి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. ఏదో ఒకటి మాట్లాడాలన్న ఉద్దేశంతో విపక్షాలు లేనిపోని ప్రకటనలు చేస్తున్నాయని విమర్శించారు. ఒకట్రెండు రోజులు అటూఇటూ అయినా.. తాను చెప్పినట్టు రాజకీయ బాంబులు పేలటం తథ్యమని పేర్కొన్నారు.

ఏఈవోలతో చర్చలు సఫలం

- సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత
- నిర్దేశించిన బాధ్యతలు నిర్వర్తిస్తామని ప్రభుత్వానికి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంతో వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) సంఘ ప్రతినిధుల చర్చలు సఫలమయ్యాయి. ఏఈవోలకు నిర్దేశించిన బాధ్యతలను నిర్వర్తించనున్నట్లు ఏఈవో సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో శనివారం జరిపిన చర్చలు సఫలమైన తర్వాత వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాస్‌గౌడ్, కె.సురేశ్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఈవోలంతా వెంటనే డీసీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విధులను నిర్వర్తించాలని కోరారు. నిర్దేశించిన విధులను పూర్తి చేయాలని, ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలని ఏఈవోలకు సూచించారు. సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఒకట్రెండురోజుల్లో ఉత్తర్వులు వస్తాయని వివరించారు. సర్వీసు రిజిస్టర్‌లో వారి సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రస్తావన ఉండదని స్పష్టం చేశారు. ఏడీవో గ్రేడ్–2లను గ్రేడ్–1గా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, దీంతో కేడర్‌స్ట్రెంగ్త్‌కు అనుగుణంగా అర్హులందరికీ పదోన్నతులు వస్తాయన్నారు. ఇందుకు సంబంధించిన ఫైలు వెంటనే సర్క్యులేట్ చేస్తామని కార్యదర్శి హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతుబీమా పథకం అమలులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతువేదికల నిర్వహణ నిధులను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని తెలిపారు.

వచ్చే నెలలో మహిళా శక్తి వారోత్సవాలు

- ఉపాధి హామీ పనులపై డీఆర్డీవోలకు మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల మొదటి వారంలో ఇందిరా మహిళా శక్తి పథకానికి సంబంధించి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇప్పించేలా గ్రామాల్లో బ్యాంకర్లతో సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేర్పేలా అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. శనివారం సచివాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల (డీఆర్‌డీవో)లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వచ్చే ఐదునెలల్లో చేపట్టాల్సిన పనులపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. మార్చి లోపు చేపట్టే ఉపాధి హామీ పనుల కోసం రూ.1,372 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉపాధి భరోసా, పంట పొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, ఇంకుడుగుంతలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛ భారత్ మిషన్‌కు ఈ నిధులు వెచ్చించాలని చెప్పారు. పీఆర్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, పీఆర్ –ఆర్డీ కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ బి.షఫీఉల్లా పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

సింగరేణిలో జీఎంల బదిలీ

మరో ముగ్గురు ఏజీఎంలకు పదోన్నతులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న జీఎంలను బదిలీచేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ముగ్గురు ఏజీఎంలకు జీఎంలుగా పదోన్నతి కల్పించారు. భూపాలపల్లి ఏరియా జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్‌ను కార్పొరేట్ జీఎం హెచ్‌ఆర్‌డీగా, ఆర్జీ–3 జీఎం ఎల్వీ.సూర్యనారాయణను శ్రీరాంపూర్‌కు, కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ జీఎం సుశంతా సాహను బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎంగా, కార్పొరేట్ ఎస్టేట్స్ జీఎం బి.వెంకటయ్యను ఆర్జీ–2 ఏరియాకు, కార్పొరేట్ ఆర్‌డీ జీఎం ఈసం కృష్ణయ్యను ఇల్లెందు జీఎం(ఓఎస్‌డీ)గా బదిలీ చేశారు. ఇక నైనీ ఏజీఎం సుజయ్ మజుమ్‌దార్‌ను జీఎండీ పదోన్నతి కల్పించి అక్కడే ఓఎస్‌డీ జీఎంగా, మందమర్రి ఏరియా ఎస్ఓటూ(ఏజీఎం) జీఎం ఏ.రాజేశ్వరరెడ్డిని భూపాలపల్లి జీఎంగా, ఆర్జీ–2 ఓసీ–1 పీఓ (ఏజీఎం) ఎస్.రాధాకృష్ణను కార్పొరేట్ ఎస్టేట్స్ జీఎంగా నియమించారు.

జీఎం పర్సనల్‌గా శ్రీనివాసరావు

కార్పొరేట్ సెక్యూరిటీ జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న కోడూరి శ్రీనివాసరావును జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ)గా నియమించారు. ఈ స్థానంలో ఉన్న సామ్యేల్ సుధాకర్ ఉద్యోగ విరమణ చేయగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. సెక్యూరిటీ జీఎంగా హెచ్‌ఆర్‌డీ విభాగం ఏజీఎం(పర్సనల్) చందా లక్ష్మీనారాయణను కేటాయించారు.

కేటీసీ పీఓ కూడా..

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్ వాసంశెట్టి శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆయన కార్పొరేట్‌లోని పర్చేస్ విభాగానికి బదిలీ కాగా, మందమర్రి ఆర్‌కేపీ ఓసీ నుంచి మిడిదొడ్డి గోవిందరావును కేటీసీ పీఓగా నియమించారు.

మూడు ఏరియాల్లోనే ముందంజ

- సింగరేణి వ్యాప్తంగా అక్టోబర్‌లో బొగ్గు ఉత్పత్తి 91శాతమే..
- లక్ష్యం దాటిన ఇల్లెందు, ఆర్జీ-1, కొత్తగూడెం ఏరియాలు
- గడిచిన ఏడు మాసాల్లో 90శాతానికే పరిమితం


ఓసీలో డంపర్ ద్వారా బొగ్గు లోడ్ చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో గడచిన అక్టోబర్‌లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో వెనుకబడింది. కంపెనీ నిర్దేశించిన 59.32 లక్షల టన్నుల లక్ష్యంలో 53.94 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదు కాగా 91 శాతానికి పరిమితమైంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి అక్టోబర్ వరకు చూస్తే 37.52 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 33.84 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేయగా 90 శాతంగా నమోదైంది.

ఆ మూడు తప్ప...

సింగరేణి సంస్థ ఆరు జిల్లాలోని 11 ఏరియాల్లో విస్తరించి ఉండగా.. 18 ఓపెన్‌కాస్ట్ గనులు, 22 భూగర్భ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించగా ఏరియాల వారీగా కూడా లక్ష్యాలు కేటాయించారు. కాగా, అక్టోబర్ నెలలో ఇల్లెందు ఏరియా 140శాతంతో అగ్రస్థానంలో నిలవగా, ఆర్జీ–3 ఏరియా 119శాతం, కొత్తగూడెం ఏరియా 104శాతం సాధించి ఆతర్వాత స్థానాల్లో దక్కించుకున్నాయి. ఇక మణుగూరు ఏరియా 85శాతం, బెల్లంపల్లి 79, మందమర్రి 53, శ్రీరాంపూర్ 68, ఆర్జీ–1 ఏరియా 89, ఆర్జీ–2 ఏరియా 79, ఆండ్రియాల ప్రాజెక్ట్ 96 శాతం, భూపాలపల్లి ఏరియా 91శాతానికే పరిమితమయ్యాయి.

ఏడు నెలల్లో రెండు ఏరియాల్లోనే

ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 11 ఏరియాల్లో 37.52 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 33.84 మిలియన్ టన్నుల(90 శాతం) ఉత్పత్తి సాధించాయి. ఈ ఏడు నెలల్లోనూ ఇల్లెందు ఏరియా 121 శాతం, ఆర్జీ–2 ఏరియా 103 శాతం సాధించాయి. మిగిలిన ఎక్కడ కూడా 100 శాతం దాటలేదు. కొత్తగూడెం ఏరియా 95 శాతం, మణుగూరు 88, బెల్లంపల్లి 85, మందమర్రి 74, శ్రీరాంపూర్ 71, ఆర్జీ–1 87, ఆర్జీ–3 97, ఆండ్రియాల 99, భూపాలపల్లి 71 శాతం సాధించి వెనుకంజలో ఉన్నాయి. కాగా, మొత్తంగా 18 ఓసీల్లో 33.94 మిలియన్ టన్నుల లక్ష్యానికి 31.08మిలియన్ టన్నులు(91 శాతం), 22 భూగర్భ గనుల్లో 35.71 లక్షల టన్నుల లక్ష్యానికి 28.13 లక్షల టన్నులు(79శాతం) ఉత్పత్తి నమోదు చేశాయి.

కొత్తగూడెం ఏరియాలో 73.28 లక్షల టన్నులు

సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో 782 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందులో కొత్తగూడెం ఏరియాకు 145 లక్షల టన్నుల లక్ష్యాన్ని కేటాయించింది. ఈ మేరకు గడిచిన ఏడు నెలల్లో మాసాల్లో 77.48 లక్షల టన్నుల లక్ష్యానికి 73.28 లక్షల టన్నులు(95 శాతం) ఉత్పత్తి నమోదైంది. ఈ ఏరియాలో కేవలం రెండు ఓసీల ద్వారానే భారీగా ఉత్పత్తి నమోదవడం విశేషం.

అక్టోబర్‌లో ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి వివరాలు...

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	12,44,000	12,87,777	104
ఇల్లెందు	3,12,000	4,35,500	140
మణుగూరు	11,16,500	9,48,070	85
బెల్లంపల్లి	2,40,000	1,89,170	79
మందమర్రి	2,99,500	1,58,222	53
శ్రీరాంపూర్	5,28,500	3,57,521	68
ఆర్జీ-1	4,41,200	3,92,136	89
ఆర్జీ-2	9,17,700	7,25,882	79
ఆర్జీ-3	4,39,000	5,22,407	119
ఆండ్రియాల	8,200	8,190	96
భూపాలపల్లి	3,85,600	3,51,789	91

రెండో సారీ నిధులు పక్కదారి

- ములకలపల్లి జీసీసీ బంక్‌లో రూ.3.75 లక్షలు స్వాహా
- గతంలో ఓసారి రూ.95లక్షల గోల్‌మాల్
- మూడు రోజులుగా నిలిచిన పెట్రోల్, డీజిల్ విక్రయాలు


జూలై 4వ తేదీన బంక్‌ను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్ (ఫైల్)

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లిలో జీసీసీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన గిరిజన ఫిల్లింగ్ స్టేషన్ కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ బంక్‌లో మూడు రోజులుగా విక్రయాలు నిలిచిపోయాయి. రూ.3.75లక్షల నిధులు పక్కదారి పట్టడమే ఇందుకు కారణమని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

2018లో ప్రారంభం

గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్(జీసీసీ) ఆధ్వర్యాన 2018 నవంబర్ 30న ములకలపల్లి తహసీల్ సమీపాన పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. మేనేజర్‌తోపాటు ఆరుగురు ఆపరేటర్లు పనిచేస్తుండగా, ప్రభుత్వ అనుబంధ సంస్థ కావడంతో అనతికాలంలోనే మంచి ఆదరణ లభించింది. నెలనెలా రూ.80 లక్షల నుండి రూ.కోటి మేర అమ్మకాలు జరిగేవి. ఇలా 2022 వరకూ లాభాల బాటలో సాగుతుండగా.. రూ.కోటి మేర నిధులు దారి మళ్లినట్లు బయటపడింది. దీంతో కొన్నాళ్లు ఆయిల్ క్రయవిక్రయాలు నిలిపేసి 'డ్రై బంక్'గా ఉంచారు. మొత్తంగా రూ.95 లక్షలు స్వాహా జరిగినట్లు తేలడంతో అదే ఏడాది చివరలో బంక్‌ను మూసేశారు. సమగ్ర విచారణ అనంతరం రూ.21 లక్షలు రికవరీ చేశారు.

నాలుగు నెలలకే ...

మూతబడిన బంక్‌ను మళ్లీ గాడిలో పెట్టడంపై సంస్థ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ప్రత్యేకంగా రూ.24 లక్షలు మంజూరు కేటాయించి బంక్‌ను దాదాపు 18నెలల అనంతరం మళ్లీ తెరిచారు. ఈ ఏడాది జూలై 4న ఐటీడీఏ పీఓ రాహుల్ చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో నగదు దారి మళ్లిన నేపథ్యాన ఈసారైనా పకడ్బందీగా నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ పాత కథే పునరావృతమైనట్లు సమాచారం. డీజిల్, పెట్రోల్ క్రయవిక్రయాలకు సంబంధించి రూ.4 లక్షల మేర గోల్‌మాల్ జరి గినట్లు తెలుస్తోంది. ఇందులో నిజానిజాలు తేల్చేందుకు మూడురోజులుగా డ్రైబంక్‌గా కొనసాగిస్తున్నారు.

ఆపరేటర్ల ప్రమేయం ఉందా?

ఆరుగురు ఆపరేటర్లు పనిచేస్తున్న క్రమాన డబ్బు పక్కదారి పట్టడంలో వీరి పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు ఆపరేటర్ల చేతివాటంతో నగదు స్వాహా చేసినా అటు మేనేజర్ ఇటు ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బంక్ సిబ్బందికి వీరి సహకారం కూడా ఉందా అనే ప్రచారం కూడా జరుగుతోంది. బంక్ పునఃప్రారంభమైన నాలుగు నెలల్లోనే అక్రమాలు జరగడం అధికారుల పర్యవేక్షణ లేమిని తెలియజేస్తోంది.

కొత్త ఆపరేటర్ల నియామకానికి దరఖాస్తులు

ములకలపల్లిలో గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఫిల్లింగ్ స్టేషన్‌లో ఆపరేటర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీసీసీ పాల్వంచ మేనేజర్ లక్ష్మోజీ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 21 ఏళ్లు నిండిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో తమ కార్యాలయంలో సంప్రదించాలని, ఎంపికై న వారికి రూ.8 వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం

జీసీసీ బంక్‌లో నగదు పక్కదారి పట్టినట్లు గుర్తించాం. ఇందులో కొందరు ఆపరేటర్ల పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా తెలిసింది. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ప్రస్తుతం పనిచేస్తున్న ఆపరేటర్ల స్థానంలో కొత్తవారిని నియమిస్తాం. అప్పటి వరకు తాత్కాలికంగా అమ్మకాలు నిలిపివేశాం.

– లక్ష్మోజీ, జీసీసీ మేనేజర్, పాల్వంచ

చెరువు నిండుగా.. ఆయకట్టు పచ్చగా !


జలకళ సంతరించుకున్న పాతలింగాల పెద్ద చెరువు


పచ్చదనంతో కనువిందు చేస్తున్న ఆయకట్టు

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో జిల్లాలోని అన్ని చెరువులు నిండాయి. దీంతో వీటి ఆయకట్టు పరిధిలో పంటలు విస్తృతంగా సాగు చేయడంతో పచ్చదనం సంతరించుకుంది. కామేపల్లి మండలం పాతలింగాలలోని పెద్ద చెరువు కూడా ఈసారి పూర్తిస్థాయిలో నిండగా జలకళ ఉట్టిపడుతోంది. దీంతో ఆయకట్టులో వరి పొలాలతో కనుచూపు మేర భూమికి పచ్చని రంగేసినట్టుగా కనిపిస్తుండగా ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. – కామేపల్లి

పర్యాటకులకు భద్రత ఏదీ?


లైఫ్ జాకెట్లు ఇవ్వకుండానే పర్యాటకులను బోట్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: కార్తీక మాసం మొదలుకావడంతో నదీస్నానం ఆచరించేందుకు శనివారం నుంచి భద్రాచలానికి భక్తులు, పర్యాటకులు వస్తున్నారు. ఈ నేపథ్యాన గోదావరిలో పర్యాటకుల షికారు కోసం నిర్వాహకులు రెండో బోటును వినియోగంలోకి తీసుకొవచ్చారు. అయితే, ఈ బోట్‌కు అధికారులు అనుమతి ఇచ్చారా, లేదా తెలియడం లేదు. ఇప్పటికే బోటు నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రూ.100 చొప్పున వసూలు చేస్తూ భక్తులకు లైఫ్ జాకెట్లు ఇవ్వడం లేదు. ఈవిషయమై గ్రామపంచాయతీ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.